www.vaarthavedhikasurya.com

PRGI.NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 2 VOLUME : 2 | సంచిక: 16 ISSUE : 16 | శుక్రవారం, 5 జూన్, 2026 FRIDAY, JUNE 5, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## కోర్టు ఉత్తర్వులను కాదని కూల్చివేతలు

• అనుమతులిచ్చిన అధికార్లపై చర్యల్లేవు • హైడ్రాపై హైకోర్టులో పటేల్‌గూడ బాధితుల పిటిషన్



2





# భూసేకరణకే తొలి ప్రాధాన్యత

• అది పూర్తి కాకుండా ప్రాజెక్టు పనులు ముందుకు సాగవు
• అందుకు అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు మంజూరు
• అయితే, నిధుల అవసరాన్ని నెల ముందే సమర్పించాలి
• వీలైనంత తొందరగా భూసేకరణ, ప్రాజెక్టులు పూర్తి కావాలి
• ఎమ్మెల్యేల సహకారంతో పూర్తి చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదే
• ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

కొడంగల్ లిఫ్టు, నెట్టెంపాడు స్టేజ్-1 పంప్‌హౌజ్ సందర్శన

మహబూబ్‌నగర్, (వార్త వేదిక సూర్య)-జూన్ 4:

"సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా గుర్తించాలి. భూసేకరణ పూర్తి చేయకుండా ప్రాజెక్టుల పనులు ముందుకు సాగవు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి" అని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పనులు వేగవంతం చేసి త్వరితగతిన ప్రాజెక్టులను పూర్తి చేయాలని నిర్దేశించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల పరిశీలనకు గురువారం సీఎం రేవంత్ రెడ్డి వచ్చారు. కర్ణాటక ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడానికి బుధవారం బెంగళూరు వెళ్లిన ముఖ్యమంత్రి.. గురువారం సాయంత్రం 3 గంటలకు కర్ణాటక చిన్ననీటి పారుదల శాఖ మంత్రి బోసురాజుతో కలిసి నేరుగా నారాయణపేట జిల్లా మక్తల్‌కు చేరుకున్నారు. అక్కడ మక్తల్-నారాయణపేట- మిగతా 2లో..

## వనమహోత్సవం లక్ష్యం 16 కోట్ల మొక్కలు

• సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు



2

## నేటి నుంచి భూములకు కొత్త విలువ

• అభ్యంతరాల స్వీకరణకు టోల్ ఫ్రీ నంబరు.. • రిజిస్ట్రేషన్ల శాఖలో చాలా మార్పులు తెచ్చాం • సబ్ రిజిస్ట్రార్ల అధికారాలు తగ్గించాం • మంత్రిగా 3,500 ఫైళ్లను క్లియర్ చేశా • ఏ ఫైల్‌పైనా గుడ్డిగా సంతకం పెట్టలేదు • ఫ్యూచర్ సిటీని ఏ ప్రభుత్వమూ రద్దు చేయలేదు • ఒకవేళ చేస్తే పరిహారం చెల్లించాల్సి ఉంటుంది • రెవెన్యూ మంత్రి పొంగులేటి



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-జూన్ 4:


సవరించిన భూముల విలువలు శుక్రవారం నుంచి అమల్లోకి వస్తాయని, ఇకపై రిజిస్ట్రేషన్ చేసుకునే వారు నూతన విలువల ప్రకారమే స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాస్త్రీయ పద్ధతిలో భూముల విలువలు సవరించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. గురువారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల విలువలు ఎకరాకు రూ.2.75 లక్షలు, మునిసిపల్ కార్పొరేషన్లలో ఎకరాకు రూ.5లక్షలు, హెచ్‌ఎండీఏ పరిధిలో ఎకరాకు రూ.10లక్షలు, ఓఆర్ఆర్ లోపల ఎకరాకు రూ.15 లక్షల చొప్పున కనిష్ఠ విలువ నిర్ణయించామన్నారు. సవరించిన భూముల విలువలపై అభ్యంతరాలు తెలిపేందుకు టోల్‌ఫ్రీ నంబరు(1800 599 4788)ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వాట్సాప్ నంబరు (8247619983)కు సైతం ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. ఎలాంటి అక్రమాలకు తావు ఇవ్వకూడదనే ఉద్దేశంతో సబ్‌రిజిస్ట్రార్ల అధికారాలు తగ్గించామన్నారు. సామాన్య రైతు కుటుంబం నుంచి దేవుడి దయతో ఇక్కడి వరకు వచ్చానని, తనకు ఏ శాఖ ఇచ్చినా మనస్ఫూర్తిగా పని చేస్తానని చెప్పారు. రెవెన్యూ శాఖలో అక్రమాలకు పాల్పడిన వారిపై గత పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తప్పు చేసిన వారిపై విచారణ చేపట్టకుండా.. తప్పించాలని చూశారని దుయ్యబట్టారు. నాలుగేళ్లపాటు ఫైళ్లను తొక్కిపెట్టారని చెప్పారు. రెవెన్యూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక 3,500 ఫైళ్లు క్లియర్ చేశానని, తప్పు చేసిన వారికి శిక్షపడేలా నిర్ణయాలు తీసుకున్నానని వెల్లడించారు. ఏ ఒక్క ఫైల్‌పైనా తాను గుడ్డిగా సంతకాలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ మిగతా 2లో..

# లాసెట్‌లో పురుషుల సత్తా

• పురుషులు 74.42శాతం, మహిళలు 70.08% అర్హత • మూడేండ్ల కోర్సులో విజయదుర్గ, ఐదేండ్ల కోర్సులో ఏ సనిత్‌రెడ్డి, ఎల్‌ఎల్‌ఎంలో నిశిత టాపర్స్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-జూన్ 4:

తెలంగాణలో న్యాయవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్-2026లో పురుష అభ్యర్థులు సత్తాచాటారు. 74.42% మంది అర్హత సాధించారు. మహిళలు 70.08% మంది క్వాలిఫై అయ్యారు. మూడేండ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో ఏపీలోని విజయనగరం జిల్లా ఆత్మరాముని అగ్రహారం గ్రామానికి చెందిన మీసాల విజయదుర్గ 150 మార్కులకు 94.31 మార్కులతో టాపర్‌గా నిలిచారు. ఐదేండ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసరకు చెందిన ఏ సనిత్‌రెడ్డి, ఎల్‌ఎల్‌ఎంలో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు మిగతా 2లో..




# భద్రాచలానికి జలగండం!

• పోలవరం ప్రాజెక్టు నిండితే ముంపులో భద్రాచలంతో పాటు పలు ప్రాంతాలు • ఆ ప్రాంతంలోని పరిశ్రమలకూ ముప్పే • 2,000 బాధిత కుటుంబాలకు నష్టపరిహారం • పూర్తిస్థాయి శాశ్వత పునరావాసం కల్పించాలి • లేనిపక్షంలో బాధితుల పక్షాన పోరాటం చేస్తాం • పీపీఏ సీఈవోకు హరీశ్‌రావు లేఖ




హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-జూన్ 4:

ఏపీ నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలోని భద్రాచలం పట్టణానికి, చుట్టుపకల ప్రాంతాలకు పొంచి ఉన్న బ్యాక్ వాటర్ ముప్పుపై బీఆర్ఎస్ పార్టీ మరోసారి గళమెత్తింది. ప్రస్తుత ప్రభుత్వం ముంపు బాధితుల సమస్యలను పట్టించుకోకపోతే తాము బాధితులకు అండగా ఉంటామని స్పష్టంచేసింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సీఈవోకు బీ ఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు గురువారం లేఖ రాశారు. ప్రస్తుతం భద్రాచలంలో పర్యటిస్తున్న పీపీఏ అధికారుల బృందానికి పినపాక, భద్రాచలం నియోజకవర్గాల బీఆర్ఎస్ నాయకులు స్వయంగా ఈ లేఖను అందజేశారు. పోలవరం పూర్తయితే తెలంగాణ ఎదుర్కోబోయే భయానక పరిస్థితులను హరీశ్‌రావు ఈ లేఖలో గణాంకాలు సహా వివరించారు. 'పోలవరం పూర్తిస్థాయి నీటిమట్టం 45.72 మీటర్లు కాగా, భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి కూడా సరిగ్గా 45.72 మీటర్లే. దీనర్థం ప్రాజెక్టు నిండితే, భద్రాచలం ఎప్పుడూ ముంపు ప్రమాదంలోనే ఉంటుంది. భద్రాచలం వద్ద గోదావరి నది లో తైన బెడ్ లెవల్ 26 మీటర్లు. బ్యాక్‌వాటర్ ప్రభావం వల్ల భద్రాచలంలో ఎప్పుడూ 13.15 మీటర్ల నుంచి 17.72 మీటర్ల మేర నీరు నిల్వ ఉంటుంది. ఇది నిత్యం ఒక జలగండంలా మా రబోతున్నద'ని హరీశ్‌రావు హెచ్చరించారు. 2021లో పోలవరం కాఫర్‌డ్యామ్ నిర్మాణం పూర్తయిన తర్వాత, 2022లో వచ్చిన బ్యాక్‌వాటర్ కారణంగా భద్రాచలం, బూర్గంపహాడ్, సారపాక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయని హరీశ్‌రావు గుర్తుచేశారు. అప్పట్లో 40% భద్రాచలం పట్టణం జలమయమై, లక్ష మందికిపైగా ప్రజలు రోడ్డునపడ్డారని వివరించారు. మిగతా 2లో..

# చల్లని కబురు వచ్చేసింది!

• కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు • కర్ణాటక, తమిళనాడుల్లోని కొన్ని ప్రాంతాల్లోకీ.. • అంచనా కంటే వారం రోజులు ఆలస్యంగా రాక • మరో 2-3 రోజుల్లో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు.. • ముందు సీమ, దక్షిణ కోస్తాల్లో కొన్ని ప్రాంతాలకు • మిగిలిన ఏరియాల్లో విస్తరణకు కొంత సమయం • ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం: ఐఎండీ

2 లో..



# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎబోలా కలకలం




• ఓ విదేశీ ప్రయాణికుడిలో ఎబోలా వైరస్ లక్షణాలు

శంషాబాద్, (వార్త వేదిక సూర్య)-జూన్ 4:

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ విదేశీ ప్రయాణికుడిలో ఎబోలా వైరస్ లక్షణాలు బయటపడటం కలకలం రేపింది. గురువారం శంషాబాద్‌కు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సూడాన్‌కు చెందిన మహ్మద్ (45)కు పరీక్షలు చేయగా.. అతడిలో ఎబోలా వైరస్ అనుమానిత లక్షణాలున్నట్లు గుర్తించారు. దీంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈనేపథ్యంలోనే గాంధీలోని ఎబోలా ఐసోలేషన్ వార్డులో అతడిని ఉంచి.. రక్త నమూనాలు, ఇతర శాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌లోని సీసీఎంబీ, పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. సదరు ప్రయాణికుడికి తీవ్రంగా జ్వరం ఉండడంతోనే ఇక్కడకు పంపించారని గాంధీ జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సునిల్ కుమార్ తెలిపారు. ఇప్పుడు జ్వరం కూడా తగ్గిందని.. అతడి ఆరోగ్యం నిలకడగానే ఉందని వెల్లడించారు.

# కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా కర్ణాటకకు

• కొరటకుంట ప్రాజెక్టుకు రాష్ట్ర జలాలను రాసిచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి • కొత్త సీఎం శివకుమార్‌కు రేవంత్ గిఫ్టు • బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు సంచలన ఆరోపణ

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-జూన్ 4:



కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కర్ణాటక కొత్త సీఎం డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహుమతిగా ఇచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు సంచలన ఆరోపణ చేశారు. కర్ణాటక ప్రభుత్వం కొరటకుంట వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు తెలంగాణ వాటా జలాలు అందించేందుకు రేవంత్ అంగీకరించారని, ఇందుకు సంబంధించిన ఒప్పందంపై రాష్ట్ర ప్రభుత్వం సంతకం చేసిందని వెల్లడించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మెప్పు కోసం రేవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. "ప్రధాన మంత్రిని పది సార్లు కలుసుకున్న మీకు.. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ దొరకడం లేదా? సీఎం పదవిలో మీరుంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎలా అపాయింట్‌మెంట్ అడుగుతారు?" అని నిలదీశారు. మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ అపాయింట్‌మెంట్ కోరుతూ రాసిన లేఖను బయటపెట్టాలని మిగతా 2లో..

సంపుటి: 2 సంచిక: 16 వార్త వేదిక సూర్య శుక్రవారం, 5 జూన్, 2026

# నేటి నుంచి భూములకు కొత్త విలువ

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు వచ్చేవి కాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో అసైన్డ్ భూములను సైతం రిజిస్ట్రేషన్ చేశారని, తామొచ్చాక వాటిని 22ఏ(నిషేధిత జాబితా)లో పెట్టామన్నారు. భూములకు సంబంధిం చిన ప్రతి డాక్యుమెంట్‌ను డిజిటలైజ్ చేస్తున్నామన్నారు. భవిష్యత్తు లో వచ్చే ఏ ప్రభుత్వం కూడా ఫ్యూచర్ సిటీని రద్దు చేయడం సాధ్యం కాదన్నారు. ఒక వేళ రద్దు చేస్తే పరిహారం చెల్లించాల్సి ఉంటుం దన్నారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల్లో సర్వే పూర్తి చేస్తా మని, అసైన్డ్ భూములకు పాలసీ తెస్తామని వివరించారు. కాగా, గచ్చిబౌలి తాలిమ్‌లో జరుగుతున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పనులను మంత్రి పొంగులేటి పరిశీలించారు. ఈ భవనాన్ని డిసెంబరులోపు అందుబాటులోకి తెస్తామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మార్పులు తీసుకొస్తున్నామన్నా రు. తొలి దశలో ఓఆర్ఆర్ లోపల ఉన్న 39సబ్‌రిజిస్ట్రార్ కార్యా లయాలను 13 క్లస్టర్లుగా విభజించి, ప్రభుత్వంపై భారం లేకుండా ప్రైవేటు నిర్మాణ సంస్థల సహకారంతో ఇంటిగ్రేటెడ్ భవనాల నిర్మి స్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే 4 ఇంటిగ్రేటెడ్ భవనాలకు శం కుస్థాపన చేశామని గుర్తుచేశారు. రెండో విడతలో జిల్లా కేంద్రాల్లో నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదల ఇంటి కల నెరవేర్చే అదృష్టం తనకు దక్కిందన్నారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్లకు రూ.7వేల కోట్లు చెల్లించామని వివరించారు.

# భద్రాచలానికి జలగండం

(మొదటి పేజీ తరువాయి)

అప్పట్లో 22 లక్షల క్యూసెకుల వరదకే అంత నష్టం జరిగితే.. భవిష్యత్తులో ప్రాజెక్టు డిజైన్ ప్రకారం 36 లక్షల నుంచి 50 లక్షల క్యూసెకుల వరద వస్తే తెలంగాణకు ఊహించని ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఐఐటీ, వ్యాపోస్ అధ్యయనాల ప్రకారం.. 36 గ్రామాల పరిధిలోని 184 చదరపు కిలోమీటర్ల మేర ముంపు ప్రభావం పడుతుందని గుర్తుచేశారు. కేవలం గ్రామాలే కాకుండా, ఈ ప్రాంతంలోని భారీ పరిశ్రమలకు కూడా బ్యాక్‌వాటర్ ముప్పు పొంచి ఉన్నదని లేఖలో పేర్కొన్నారు. దాదాపు ఐదువేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న ఐటీసీ పేపర్‌బోర్డ్, హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం జలవిద్యుత్తు ప్రాజెక్టులకు ఈ బ్యాక్‌వాటర్ వల్ల తీవ్ర ప్రమాదం వాటిల్లే అవకాశం ఉన్నదని వివరించారు. పోలవరం ప్రాజెక్టు ముంపు వల్ల పదేపదే నష్టపోతున్న సుమారు రెండు వేల బాధిత కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారంతోపాటు పూర్తిస్థాయి శాశ్వత పునరావాసం కల్పించాలని హరీశ్‌రావు ఆ లేఖలో డిమాండ్ చేశారు. భద్రాచలం వద్ద కొత్తగా ఐదు కిలోమీటర్ల మేర కరకట్టల నిర్మాణం చేపట్టాలని, బూర్గంపహాడ్, సారపాక తదితర ముంపు గ్రామాలకు రక్షణ గోడలు నిర్మించాలని కోరారు. భద్రాచలం డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానంగా ఉన్న ఎనిమిది అవుట్‌ఫాల్ రెగ్యులేటర్లు బ్యాక్‌వాటర్ వల్ల మూసుకుపోతున్నాయి కాబట్టి, పట్టణ వరద నీటిని గోదావరిలోకి పంపేందుకు తక్షణమే పంపింగ్ స్టేషన్లు, ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పరిధిలో పోలవరం ముంపు సమస్యల పరిష్కారం, రక్షణ పనుల పర్యవేక్షణ కోసం భద్రాచలంలోనే ప్రత్యేకంగా పీపీఏ డివిజన్ ఆఫీసును ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా బీఆర్ఎస్ పార్టీ ఈ పోరాటాన్ని కొనసాగిస్తుందని, పోలవరం అథారిటీ తక్షణమే స్పందించి ఈ చర్యలు చేపట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# లాసెట్‌లో పురుషుల సత్తా

(మొదటి పేజీ తరువాయి)

చెందిన శేగూరి నిశిత ప్రథమస్థానం సాధించారు. మూడేండ్ల కోర్సులో టాపర్ మినహా తొలి పదిస్థానాల్లో 9 మంది పురుష లు నిలువడం గమనార్హం. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్న త విద్యామండలి చైర్మన్ జీ బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ కుమార్ గురువారం ఫలితాలు విడుదల చేశారు. మూడేండ్ల, ఐదేండ్ల ఎల్ఎల్‌బీ కోర్సులతోపాటు పీజీస్థాయి ఎల్ఎల్ఎం కోసం ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యం లో మే 18న పరీక్ష నిర్వహించారు. న్యాయవిద్య కోర్సులకు 66,864 మంది రిజిస్టర్ చేసుకున్నారు. వీరిలో 54,374 మంది పరీక్ష రాయగా 39,673 మంది(72.96%) అర్హత సాధించారు. మూడేండ్ల కోర్సులకు 47,573 మంది దరఖాస్తు చేసుకోగా, 38,261 మంది పరీక్షలు రాశారు. వీరిలో 29,327 (76.65%)మంది అర్హత సాధించారు. ఐదేం డ్ల లా కోర్సులకు 14,077 మంది దరఖాస్తు చేసుకోగా, 11,520 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 6,073 (52.72%) మంది క్వాలిఫై అయ్యారు. అలాగే పీజీస్థాయి ఎల్ఎల్ఎం కోర్సులకు 5,214 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నారు. 4,593 మంది పరీక్ష రాశారు. 4,273 మంది (93.03%) అర్హత సాధించారు.

# రైతులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రత్యామ్నాయ పంటలు వేయాలి: తుమ్మల

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-జూన్ 4:



ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేస్తున్న నేపథ్యం లో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. విపత్తులు ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలని, ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలని పిలుపునిచ్చారు. గురువారం సచివాలయంలో వ్యవసాయ, ఉద్యానశాఖలపై సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్ ఆదేశాల మేరకు ఈనెల 6, 8, 10 తేదీల్లో గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కలిగించాలని సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఉపగ్రహ చిత్రాలు సేకరించినట్లే.. రాష్ట్రవ్యాప్తంగా శాటిలైట్ ఆధారిత నివేదికలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. కాగా, కోహెడలో రూ. 2,284.32 కోట్లతో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌కు ఈనెల ఆరో తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు.

# తొలి ప్రాధాన్యం భూసేకరణకే






(మొదటి పేజీ తరువాయి)

కొడంగల్ ఎత్తిపోతల పథకానికి (ఎన్‌కేఎల్ఐఎస్ ) సంబంధించిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. నేరుగా పంప్‌హౌజ్ వద్దకు వెళ్లి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీ నిర్వాహకులు సీఎంకు వివరించారు. పనులను వేగవంతం చేయాలని, ప్యాకేజీ-1లో కాంక్రీట్ పనులు చేపట్టాలని అధికారులకు సీఎం రేవంత్ నిర్దేశించారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి కావాలని, నిధుల కొరత లేకుండా తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతిని తెలుసుకొని అక్కడి నుంచి జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలో నిర్మించిన నెట్టెంపాడు స్టేజ్-1 పంప్‌హౌజ్‌కు చేరుకున్నారు. అక్కడ ఫొటో ప్రదర్శనను తిలకించి, పంప్‌హౌజ్‌ను పరిశీలించారు. జూరాల సామర్థ్యం పెంపు, నెట్టెంపాడు, గట్టు, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పనుల పూర్తి, సమస్యలు, పరిష్కారాలపై ఇరిగేషన్ అధికారులు ప్రత్యేకంగా తయారు చేయించిన వీడియోను ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి చూశారు. జూరాల సామర్థ్యం పెంపు, ఉన్న రిజర్వాయర్ల సామర్థ్యం పెంచుకొని వాటిలో నీటిని నింపుకోవడంపై రూ.16 లక్షలతో సర్వే చేసి ఇప్పటికే డీపీఆర్ తయారు చేయించామని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలుపగా.. డీపీఆర్‌ను పరిశీలించి ఎక్కువ నీటిని నిల్వ చేసుకునే పనులు చేపడదామని సీఎం సానుకూలంగా స్పందించారు. అనంతరం నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిలలో ప్రాజెక్టుల పనులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల ప్రగతిపై సీఎంకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమన్వయం చేసుకుని భూసేకరణ పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత జిల్లాల కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. ''కలెక్టర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులను పూర్తి చేయాలి. ఇందుకు అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది'' అని పునరుద్ఘాటించారు. భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పూర్తికాకుండా సివిల్ పనులు చేపడితే ఆర్థిక వనరులను కచ్చితత్వంతో ఖర్చు చేయలేమని సూచించారు. భూసేకరణ పూర్తి కాకుండా పెద్ద ఎత్తున సివిల్ వర్క్స్ చేపట్టవద్దని నిర్దేశించారు. ప్రాజెక్టుల పనులకు సంబంధించి కచ్చితమైన వర్క్‌ప్లాన్లను ఇంజనీర్లు తయారు చేయాలని, స్పష్టమైన ఆర్థిక అవసరాలు, టైమ్‌లైన్స్‌తో ముడిపెట్టాలని ఆదేశించారు. కోర్టు కేసులపై త్వరగా చర్యలు తీసుకుని వర్క్స్‌పై ఉన్న స్టేలను ఎత్తివేయించాలని సూచించారు. నెలవారీగా నిధుల అవసరాలను అధికారులు ముందుగానే తెలియజేయాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి తోపాటు పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ, పునరావాస చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. భూసేకరణ పూర్తయిన తర్వాత సివిల్ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నార్లాపూర్ రిజర్వాయర్ వంద శాతం, ఏదుల రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయ్యాయని, వట్టెం రిజర్వాయర్ కాంక్రీట్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. నిధులకు సంబంధించి నెలవారీగా ముందుగానే నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. సీఎం పర్యటనలో ఆయన వెంట జిల్లా ఇన్‌చార్జి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి ఉన్నారు.

# 'చల్లని' కబురు వచ్చేసింది!

**విశాఖపట్నం/న్యూఢిల్లీ:** మండుటెండలతో అల్లాడిపోతున్న దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు చెప్పింది. దేశంలో వర్షాకాలానికి నాంది పలికే నైరుతి రుతుపవనాలు గురువారం (జూన్ 4) అధికారికంగా కేరళలోకి ప్రవేశించాయి. దీంతో భారత్‌లో ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనట్లు ఐఎండీ ప్రకటించింది. కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించడంతో అక్కడ విస్తృతంగా వర్షాలు కురుస్తుండగా, రానున్న రోజుల్లో ఇవి దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించనున్నాయి. సాధారణంగా ప్రతి ఏడాది జూన్ 1న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయి. అయితే ఈసారి అవి నాలుగు రోజుల ఆలస్యంగా జూన్ 4న రాష్ట్రంలోకి ప్రవేశించాయి. అంతకుముందు మే 26న కేరళలోకి రుతుపవనాలు వస్తాయని ఐఎండీ అంచనా వేసింది. కానీ సముద్ర, వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పుల కారణంగా వాటి పురోగతి మందగించింది. అనంతరం జూన్ 4 ప్రాంతంలో కేరళకు చేరుకునే అవకాశముందని సవరించిన అంచనాను వెల్లడించగా, అదే నిజమైంది.

**వారం రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి!**

అటు తమిళనాడుపై కూడా రుతుపవనాల ప్రభావం కనిపిస్తోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయి. రానున్న గంటల్లో 15 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కేరళలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ఇప్పుడు క్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నాయి. సాధారణ పరిస్థితులు కొనసాగితే వచ్చే వారం రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రస్తుతం తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడుతున్న తెలుగు రాష్ట్రాలకు ఉపశమనం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రుతుపవనాల సాధారణ ప్రయాణాన్ని పరిశీలిస్తే, జూన్ నెలలో ఇవి వేగంగా పశ్చిమ తీర ప్రాంతాలతో పాటు ఈశాన్య రాష్ట్రాలకు విస్తరిస్తాయి. అనంతరం మధ్య భారతదేశంలోని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు జూన్ మధ్య నాటికి చేరుకుంటాయి. అక్కడి నుంచి తూర్పు, ఉత్తర భారత రాష్ట్రాల వైపు కదులుతాయి. దేశ రాజధాని ఢిల్లీలో సాధారణంగా జూన్ 27 ప్రాంతంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. అలాగే పంజాబ్, హరియానా, రాజస్థాన్, పశ్చిమ ఉత్తరప్రదేశ్ వంటి వాయవ్య భారత రాష్ట్రాలకు జూన్ చివరి నాటికి లేదా జూలై మొదటి వారంలో విస్తరించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా కొనసాగితే ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాలు జూలై ఆరంభంలోనే వర్షాల ప్రభావంలోకి వచ్చే అవకాశముందని ఐఎండీ పేర్కొంది.

అయితే ఈ ఏడాది వర్షాకాలంపై ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు అభివృద్ధి చెందుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. జూన్ నెలలో ఈ ప్రభావం బలహీనంగా ఉన్నప్పటికీ, సెప్టెంబరు నాటికి మరింత బలపడే అవకాశం ఉందని వివరించింది. దీంతో జూన్ నుంచి సెప్టెంబరు వరకు కొనసాగే నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని ఐఎండీ అంచనా వేస్తోంది. దీర్ఘకాల సగటు వర్షపాతంతో పోలిస్తే ఈసారి సుమారు 90 శాతం మేర మాత్రమే వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. వ్యవసాయం, జలాశయాల నీటి నిల్వలు, తాగునీటి అవసరాలపై ఈ పరిస్థితుల ప్రభావం ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయినప్పటికీ, కేరళలోకి నైరుతి రుతుపవనాల ప్రవేశంతో దేశవ్యాప్తంగా రైతుల్లో ఆశలు చిగురించాయి. ఎండల తీవ్రత తగ్గి వాతావరణం చల్లగా మారడంతో సాగు పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఏర్పడ్డాయి.

# కోర్టు ఉత్తర్వులను కాదని కూల్చివేతలు

- అనుమతులిచ్చిన అధికార్లపై చర్యల్లేవు
- హైడ్రాపై హైకోర్టులో పటేల్‌గూడ బాధితుల పిటిషన్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-జూన్ 4:

కోర్టు ఇచ్చిన యథాతథ స్థితి ఉత్తర్వులను కాదని హైడ్రా తమ ఇళ్లను కూల్చివేసిందని ఆరోపిస్తూ సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడకు చెందిన తమ్మిశెట్టి శ్రీకాంత్ సహా మరో 28 మంది ఇళ్ల యజమానులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పటేల్‌గూడ సర్వే నెంబర్ 6లో 136 నుంచి 181 వరకు ఉన్న ప్లాట్లలో కొత్తగా కట్టుకున్న 28 ఇళ్లను హైడ్రా నిర్దయగా కూల్చేసిందని పేర్కొన్నారు. నాలా కన్వర్షన్‌కు అనుమతి ఇచ్చిన రెవెన్యూ అధికారులు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసిన రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు, భవన నిర్మాణ అనుమతులిచ్చిన మున్సిపల్ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. వాదనలు విన్న ధర్మాసనం.. అనుమతులిచ్చిన అధికారులపై ఏమైనా చర్యలు తీసుకున్నారా? అని ప్రశ్నించగా ప్రభుత్వ న్యాయవాది సమాధానమిస్తూ తప్పుడు వివరాలతో అనుమతులు పొందారని పేర్కొన్నారు. ఆ మేరకు ఈ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంటూ రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, సంగారెడ్డి కలెక్టర్, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, హైడ్రాలకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ జూన్ 15కు వాయిదాపడింది.

**ఎన్‌వీఎన్ కన్‌స్ట్రక్షన్ భూమిలో జోక్యం చేసుకోవడం లేదు: హైడ్రా**

కూకట్‌పల్లిలోని సర్వే నం.1003 నుంచి 1006 వరకు 13.17 ఎకరాల్లో ఎన్‌వీఎన్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన భూమిలో జోక్యం చేసుకోవడం లేదని గురువారం ప్రభుత్వం, హైడ్రా న్యాయవాదులు హైకోర్టుకు తెలియజేశారు. 2008లోనే రెగ్యులరైజేషన్ చేసి.. ప్రభుత్వమే పంచనామా చేసి పొజిషన్ అప్పగించిన ఆ భూమి ఏదులకుంటకు చెందినదని పేర్కొంటూ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. దీనిపై ఇటీవల హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దాంతో ప్రభుత్వ న్యాయవాదులు హైకోర్టుకు వివరణ ఇచ్చారు.



# కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా కర్ణాటకకు

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. తెలంగా ణ ఏర్పాటై 12 ఏళ్లు గడిచినా ఉద్యమకారు లను గుర్తించలేని దుస్థితికి బీఆర్ఎస్, కాంగ్రె స్‌లే కారణమని ఆరోపించారు. ఎన్నికల్లో పొత్తులపై తమ జాతీయ నాయకత్వమే తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఏపీ, తెలంగాణల్లో రాజకీయ పరిస్థితులు విభిన్నమై నవని రాంచందర్ రావు వ్యాఖ్యానించారు. ఓటుకు నోటు కేసులో నాడు రేవంత్‌ను కేసీఆ ర్ కాపాడారని, ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో కేసీఆర్‌ను రేవంత్ కాపాడు తున్నారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారాన్ని సీబీఐకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగిన అభివృద్ధిని కేటీఆర్‌కు స్వయంగా చూపించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు రాంచందర్‌రావు ప్రకటించారు. ''రెండు రాష్ట్రాలకు కేటీఆర్‌ను బస్సులోనో, కారులోనో నేనే స్వయంగా తీసుకు వెళతా. తెలంగాణ కంటే ఆ రాష్ట్రాల్లో జరిగిన అభివృద్ధి కచ్చితంగా ఎక్కువ ఉంటుంది. దానిని నిరూపిస్తా. అప్పుడు ఆయన ఎమ్మెల్యే పదవికే కాకుండా మొత్తం రాజకీయాలకే రాజీనామా చేస్తే మంచిది'' అని వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ సభకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతిస్తే సరిపోయేదని రాంచందర్‌రావు అభిప్రాయపడ్డారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని, ఆ రెండు పార్టీలే తెలంగాణ పాలిట అసలైన భూతాలని దుయ్యబట్టారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన ఎంఐఎంతో కలిసి ఎలా పని చేస్తారని మండిపడ్డారు.



# వనమహోత్సవం లక్ష్యం 16 కోట్ల మొక్కలు

- సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-జూన్ 4:

వనమహోత్సవంలో ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇందులో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 6.18 కోట్లు, హెచ్ఎండీఏ పరిధిలో 4.50 కోట్ల మొక్కలు నాటనున్నారు. అటవీ శాఖ 89.59 లక్షల మొక్కల పెంపకం చేపట్టనుంది. వర్షా కాలంలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసం స్థలు, గ్రామాలు, పట్టణాలు, రహదారుల వెంట విస్తృత స్థాయిలో నాటేందుకు కార్యా చరణ రూపొందించారు. నాటిన ప్రతి మొక్క సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ అర్బన్ ఫారెస్ట్ పార్కులో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వనమహోత్సవా న్ని ప్రారంభించేందుకు అటవీ శాఖ అధికా రులు సన్నాహాలు చేస్తున్నారు. అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, అటవీ దళాల అధిపతి వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్‌తో కలిసి గుర్రం గూడ పార్క్ ప్రాంతాన్ని ఉన్నతాధికారులు పరిశీలించారు.

# తొలి ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన మోదీ

- గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని
- ప్రపంచ క్రీడా వారసత్వంలో ఒక కొత్త అధ్యాయం చేరిందని వెల్లడి

**న్యూఢిల్లీ:** తొలి ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్ 2026ను ప్రారంభించారు ప్రధాని నరేంద్ర మోదీ. ఒలింపిక్స్‌తో సహా అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లలో యోగాసనానికి భవిష్యత్తులో చోటు దక్కుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ క్రీడా వారసత్వంలో ఒక కొత్త అధ్యాయం చేరిందని అభిప్రాయపడ్డారు. కోట్లాది మంది ప్రజలు యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ యోగా దినోత్సవానికి కొన్ని రోజుల ముందు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి జీవన సంప్రదాయం కాలంతో పాటు కొత్త దశల్లోకి ప్రవేశిస్తుంది. ఈ ప్రపంచ యోగాసన క్రీడల ఛాంపియన్‌షిప్ అటువంటి కొత్త దశకు నాంది పలుకుతుంది. ఈ ఛాంపియన్‌షిప్ ద్వారా యోగాసనం ఒక పోటీ క్రీడగా గుర్తింపు పొందుతుంది. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో గానీ లేదా ఇతర బహుళ క్రీడా పోటీల్లో, అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లలో యోగాసనం తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటుందని నేను విశ్వసిస్తున్నాను. ఐక్యరాజ్యసమితిలో అంత ర్జాతీయ యోగా దినోత్సవం కోసం భారత్ చేసిన ప్రతిపాదనకు ఆ సమయంలో 190 దేశాలు మద్దతు ఇచ్చాయి. నేడు లక్షలాది మంది ప్రజలు యోగాను తమ దినచర్యలో ఒక భాగంగా చేసుకున్నారు. ధ్యానం, ప్రాణా యామం వారి జీవనశైలిలో అంతర్భాగంగా మారుతున్నాయి. యోగాసన క్రీడలు విస్తరిం చే కొద్దీ, కొత్త అవకాశాలు కూడా పెరుగుతా యి. ఇది క్రీడాకారులతో పాటు శిక్షకులు, పరిశోధకులు, ఈవెంట్ నిర్వాహకులకు కూడా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. అహ్మదాబాద్ గడ్డ నుంచి ప్రపంచ క్రీడా వారసత్వంలో మరో కొత్త అధ్యాయం చేరింది. మొట్టమొదటి ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్ ప్రారంభమవుతోంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి ఇక్కడకు వచ్చిన వివిధ దేశాల క్రీడాకారులందరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను. అహ్మదాబాద్ ఒక యునెస్కో ప్రపంచ వార సత్వ నగరం. ఇంతటి చారిత్రక నగరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం యావత్ దేశానికి ఎంతో గర్వకారణం. కొద్ది రోజుల్లోనే, జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని కూడా జరుపుకోబోతున్నాం. ఆ రోజున ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో యోగా సంబంధిత కార్యక్రమాలు జరుగుతాయి. వీ టిలో ప్రధాన కార్యక్రమం మరో చారిత్రక భారతీయ నగరమైన కోల్‌కతాలో జరగనుం ది. ప్రపంచ యోగా దినోత్సవానికి కొద్ది రోజు ల ముందే జరుగుతున్న ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్ ఆర్యోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందిస్తోంది. అని ప్రధాని మోదీ అన్నా రు. ఈ క్రమంలోనే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్ ఆరోగ్యకరమైన వృద్ధా ప్యం కోసం యోగాను ప్రధాని మోదీ ప్రస్తా వించారు. దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కాపాడుకో వడానికి యోగా ఒక ప్రభావవంతమైన మా ర్గాన్ని అందిస్తుందని అన్నారు.

# మత్స్యకారులపై పోలీసుల తీవ్ర సరైనది కాదు

## -తెలంగాణ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.వి. రమణ



అడ్డగూడూర్ జూన్ 4 (వార్త వేదిక సూర్య ):

యాదాద్రి భువనగిరి జిల్లా, అడ్డగూడూరు మండలం, ధర్మారం గ్రామ మత్స్యకార సహకార సంఘం పరిధిలోని చెరువుల్లో చేపల దొంగతనానికి పాల్పడుతున్న దుండగులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నప్పటికీ, బాధితులైన మత్స్యకారులపైనే తిరిగి కేసులు నమోదు చేయడం దారుణమని పోలీసుల వైఖరి సరైనది కాదని తెలంగాణ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.వి. రమణ ముదిరాజ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ఆయన స్పందిస్తూ, మత్స్యకారుల జీవనాధారమైన చెరువులను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, కానీ దానికి విరుద్ధంగా స్థానిక ఎస్ఐ ఏకపక్షంగా వ్యవహరిస్తూ దొంగలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. మత్స్యకారుల హక్కులను కాలరాస్తున్న ఇటువంటి చర్యలను ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. బాధిత మత్స్యకారులకు న్యాయం జరగకపోతే, రాబోయే రోజుల్లో ఈ అంశాన్ని రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా తీసుకెళ్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మారం మత్స్యకారుల ముదిరాజుల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనిల్, ధర్మారం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దాసరి ఈశ్వర్, దాసరి పులేందర్, కార్యదర్శి దాసరి బిక్షం, సభ్యులు రామచంద్రు, మహేష్, శ్రీను, మధు, నారాయణ,దశరథ సోమలక్ష్మి, మహేష్, లింగయ్య పాల్గొన్నారు

# ఆర్వో ఫిల్టర్ మరమ్మత్తు పనులకు శ్రీకారం:



## - కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్

చౌటుప్పల్, జూన్ 4 వార్తా వేదిక సూర్య:

ఆర్వో ఫిల్టర్ మరమత్తు పనులను చేయించి.. వార్డు ప్రజలకు త్వరలోనే ఫిల్టర్ ద్వారా త్రాగునీరు అందుబాటులోకి తెస్తానని కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ అన్నారు. గురువారం దివీస్ పరిశ్రమ, చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ల సహకారంతో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 13వ వార్డు రాంనగర్ కాలనీలో ఆగిపోయిన ఆర్వో ఫిల్టర్ మరమ్మతు పనులను కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ కుమార్ గురువారం ప్రారంభించారు. మొదట బోరు మరమ్మతులను చేశారు. బోరులో సమృద్ధిగా నీరు ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బత్తుల వాణి విప్లవ కుమార్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆర్వో ఫిల్టర్ చెడిపోయిందని వార్డు ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దివీస్ పరిశ్రమ సహకారంతోనే వాటర్ ఫిల్టర్ నిర్మించడంతో, వాటర్ ఫిల్టర్ మరమ్మత్తుల గురించి పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లానన్నారు. వెంటనే స్పందించిన యాజమాన్యం బోరు, ఫిల్టర్ మరమ్మతులను చేపట్టిందన్నారు. త్వరలోనే వార్డు ప్రజలకు ఫిల్టర్ వాటర్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్కాల కుమార్ గౌడ్, చెవగోని వెంకటేష్ గౌడ్, మార్గం నర్సింహ్మా యాదవ్, చెరుకు అశోక్ గౌడ్, గూయని జంగయ్య, చెరుకు సాయి గౌడ్, దివిస్ ప్రతినిధి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా డిక్లరేషన్ హామీల అమలుకు పోరాటం కొనసాగిస్తాం

## అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి



నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )

నల్లగొండ జిల్లా, కనగల్లు మండలం తుర్కపల్లి గ్రామంలో ఈరోజు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళా డిక్లరేషన్ అమలు, మహిళల సమస్యలు, సంక్షేమ పథకాలపై సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ములుగు మహిళా డిక్లరేషన్ పేరుతో మహిళలకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే వాటిలో చాలా వరకు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు.

ప్రతి మహిళకు నెలకు □2,500 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయలేదని అన్నారు. అలాగే మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని చెప్పినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఇప్పటికీ అధిక వడ్డీలకు అప్పులు తీసుకునే పరిస్థితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజకీయాల్లో మహిళలకు 25 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. చదువుకున్న విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు, స్కూటీలు అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ విషయంపై కూడా చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మహిళలను లక్షాధికారులుగా చేస్తామని చెప్పి, మహిళా సంఘాలకు తగిన ఆర్థిక సహాయం అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం వంటి హామీల అమలుపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా డిక్లరేషన్‌లో ప్రకటించిన పథకాల అమలుకు అవసరమైన నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించకుండా హామీలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు.

మహిళల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఆర్థిక సాధికారత కోసం జిల్లావ్యాప్తంగా సమగ్ర సర్వేలు నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా అమలు చేసే వరకు ఐద్వా ఆధ్వర్యంలో ఉద్యమాలు, పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె. సుల్తానా, మహిళా నాయకురాళ్లు ఆదిమల్ల మారెమ్మ, బయలు యాదమ్మ, మీనమ్మ, లక్ష్మి, ప్రశాంతి, దుర్గమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 6 న వంగర సత్తయ్య సంతాప సభ



నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )

మాజీ సర్పంచ్,మాజీ వైస్ ఎంపీపీ, సిపిఎం సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ వంగరి సత్తయ్య సంతాప సభ ఎన్నారైస్ గార్డెన్ లో నిర్వహించడం జరుగుతుందని సిపిఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య తెలిపారు. గురువారం చర్లపల్లి వార్డు కార్యాలయం దగ్గర సంతాప సభ కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ.. కామ్రేడ్ వంగరి సత్తయ్య కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి చివరి వరకు ఎర్రజెండాను వీడకుండా పేదలు, కార్మికులు అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై నిరంతరం పోరాటాలలో పాల్గొన్న గొప్ప నాయకుడు కామ్రేడ్ సత్తయ్య అని అన్నారు. చర్లపల్లి సర్పంచిగా రెండుసార్లు మండల పరిషత్ వైస్ ఎంపీపీ గా పని చేసిన సందర్భంలో చర్లపల్లి లో ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ ల కోసం ప్రభుత్వం పై పోరాడి భూసేకరణ చేయించి అందరికీ ఇంటి స్థలం ఇండ్లు ఇప్పించడం జరిగింది. గ్రామ ప్రజల కోసం బోరు వేయించి ఇంటింటికి నల్ల కనెక్షన్ ఇప్పించినది మొదట వారేనని అన్నారు. విస్తరిస్తున్న చర్లపల్లి కి భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే విధంగా స్మశాన వాటిక ,గ్రామపంచాయతీ కార్యాలయం నిర్మాణంలో ఎంతగానో కృషి చేశారు. తన తండ్రి ద్వారా వచ్చిన 18 ఎకరాల భూమి ఇనాం భూములను దళితులకు పంచిన గొప్ప నాయకుడు కామ్రేడ్ వంగర సత్తయ్య , సిపిఎం చేస్తున్న పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటూ ఆనాటి అరాచక ముఠా నల్లగొండ పట్టణం లో ఎర్ర చొక్కా ధరిస్తే పట్టుకొని కొట్టే కాలంలో ఎదురు తిరిగి నిలబడిన గొప్ప నాయకుడు. పార్టీ మారమని ఒత్తిడి చేసిన బెదరకుండా తన చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడలోనే కొనసాగారు. అనారోగ్యంతో మే 27 న బుధవారం రాత్రి అమరుడయ్యారు వారు చేసిన సేవలను స్మరించుకుంటూ. వారు కోరుకున్న దోపిడీ లేని సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయడమే వారికి నిజమైన నివాళి అని అన్నారు. ఈ సంతాప సభకు సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు. సభకు చర్లపల్లి ప్రాంత ప్రజలు, అభిమానులు పార్టీలకతీతంగా పెద్ద సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం లో చర్లపల్లి సిపిఎం శాఖ కార్యదర్శి పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, శాఖ సభ్యులు రాపోలు చంద్రయ్య, కాసర్ల గౌతమ్ రెడ్డి, ఎండి సలీం, గంజి రాజేష్, శ్రీరంగం శేఖర్ రెడ్డి, వెంకటయ్య, రాములు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



# నల్గొండలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం

## 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 41వ వార్డులో పంపిణీ

నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నల్గొండ నగరంలోని 41 వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళల సంక్షేమం కోసం చేపడుతున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం వారికి ఆర్థికంగా, సామాజికంగా తోడ్పాటునిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమం లో 41 వ వార్డు కార్పొరేటర్ వేణు గోపాల్ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చీరలు అందుకున్న మహిళలు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వార్డు లో ఉత్సాహభరిత వాతావరణం లో నిర్వహించబడగా, లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

# పర్యావరణ పరిశుభ్రత ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలి

## కార్పొరేటర్ పేర్ల మల్లీశ్వరి -అశోక్ చంద్ర



నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )

నల్గొండ నగరపాలక సంస్థ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యచరణ లో పర్యావరణ వారోత్సవాలు వార్డు సభ శేషమ్మ గూడెం డివిజన్ కార్యాలయం లో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పేర్ల మల్లీశ్వరి -అశోక్ చంద్ర మాట్లాడుతూ..పర్యావరణ పరిశుభ్రత ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కమిషనర్ శరత్ చంద్ర, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రదీప్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్ కిషన్ రావు, అంగన్వాడి టీచర్స్, ఆర్పీలు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేసారు.

# బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా చొక్కళ్ల చరణ్ నియామకం

నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )



నల్గొండ జిల్లా బీసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడిగా చొక్కళ్ల చరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల మధు యాదవ్ పాల్గొన్నారు.

అనంతరం జాతీయ అధ్యక్షుడు మాట్లాడుతూ, నల్గొండ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమించాలని, బీసీ సమాజ అభ్యున్నతి,రాజకీయ సాధికారత కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం యూనివర్సిటీ అధ్యక్షులు సాగర్ల కర్ణాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైనటువంటి చొక్కల చరణ్ మాట్లాడుతూ.. నా మీద నమ్మకం ఉంచి నాకు జిల్లా బాధ్యతలు ఇచ్చినందుకు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నల్ల మధు యాదవ్ కి ధన్యవాదములు తెలియజేసారు.

సంపుటి : 2 సంచిక: 16 వార్త వేదిక సూర్య హైదరాబాద్ శుక్రవారం, జూన్ 05, 2026

# పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కావాలి

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )

పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాక్రమంలో భాగంగా పర్యావరణ వారోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ గురువారం చండూరు మండలం, బంగారుగడ్డ గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు హాజరయ్యారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక సందర్భంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, పర్యావరణ వారోత్సవం లో భాగంగా జూన్ 12 వరకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని అన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చెత్తను వీధుల్లో వేయకుండా ప్రత్యేక చెత్త బుట్టలను ఏర్పాటు చేశామని,గ్రామం స్వచ్ఛతలో ఆదర్శంగా నిలిచి స్వచ్ఛ పురస్కారాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా లభించే నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. గ్రామంలోని బోర్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి విడతలో అర్హులకు ఇళ్లు మంజూరు చేశామని, రెండో విడతలో గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇళ్లు అందజేస్తామని తెలిపారు. రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే సర్వే నిర్వహించి స్థలాలు పరిశీలించమన్నారు. మహిళా సంఘాల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.1 లక్ష రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. విద్యార్థులు పదో తరగతి తర్వాత చదువును మధ్యలో ఆపకుండా ఇంటర్, డిగ్రీ స్థాయిలో విద్యను కొనసాగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ కళాశాలలు, మెడికల్, నర్సింగ్ కళాశాలలు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు వంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, స్వయం ఉపాధి చేపట్టాలనుకునే మహిళా సంఘాలకు రుణాలు అందిస్తామని తెలిపారు.



వర్షపాతం తక్కువగా ఉండే పరిస్థితుల్లో రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే కందులు, పెసర్లు, మినుములు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని నివారించి డెంగ్యూ వంటి వ్యాధులను అరికట్టవచ్చన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, తాగునీటి నాణ్యతను విలేజ్ వాటర్ లెవల్ కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన చెట్లను నరికివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంట అవశేషాలను కాల్చితే రూ.5 వేల జరిమానా, ఇతరుల పంటలకు నష్టం కలిగించేలా కాల్చితే రూ.25 వేల జరిమానా విధిస్తామని, అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ మహబూబ్ గ్రామపంచాయతీకి 500 ప్లేట్లు, 500 గ్లాసులను విరాళంగా అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలో ఇంకుడు గుంతలను నర్సరీలను పరిశీలించి తల్లి పేరుతో రావి మొక్కను నాటారు. ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వ్యవసాయ, హార్టికల్చర్, ఆరోగ్యశాఖ అధికారులతో వానాకాలంలో ఎలాంటి పంటలు వేయాలి? ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు.

ఈ కార్యక్రమంలో డిపిఓ శంకర్ నాయక్ , తహసిల్దార్ రవికాంత్ శర్మ ,ఎంపీడీవో బండారు యాదగిరి, ఇంచార్జ్ ఎం పి ఓ, కార్యదర్శి కోటి, అగ్రికల్చర్ డివిజన్ ఏడి వేణుగోపాల్, సర్పంచ్ బోయపల్లి సునీత, శ్రీను, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని హర్షితను అభినందించిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )

నకిరేకల్ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 10 వ తరగతి విద్యార్థిని పొట్టబత్తుల హర్షిత బాసర ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించడంతో ఆమెను ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు. ఈ సందర్భంగా హర్షితను ఎమ్మెల్యే శాలువా తో సత్కరించారు.ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ రూ. 10 వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. కష్టపడి చదివితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, హర్షిత సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

## సుబ్బారావు కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )



మిర్యాలగూడ పట్టణానికి చెందిన సుబ్బారావు అనారోగ్యంతో మృతి చెందగా వారి మృతదేహానికి ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పూలమాల వేసి, నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## హక్కుల నేత, ప్రకృతి ప్రేమికుడు సుబ్బారావు కు విప్లవ జోహార్లు

### సి. పి ఐ (ఎం. ఎల్) న్యూడెమోక్రసీ, నల్లగొండ జిల్లా కమిటీ సంతాపం.

నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )



మానవ హక్కుల వేదిక వ్యవస్థాపక సభ్యుల్లో ప్రముఖులు, సుదీర్ఘ కాలం హక్కుల ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన నేత కామ్రేడ్ పి. సుబ్బారావు జీవితం నేటి తరానికి స్ఫూర్తి. గత ఏడు దశబ్దాలుగా దేశంలో, రాష్టంలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలతో పెన వేసుకున్న పేగు బంధం ఆయనది. తన చిన్న వయసు నుండే విద్యార్థి ఉద్యమాలు మొదలుకొని ఉపాధ్యాయ, హక్కుల, హేతువాద, పౌర, ప్రజాస్వామిక ఉద్యమాలతో పాటు ఫ్లోరైడ్,యూరేనియం వ్యతిరేక ఉద్యమం , జల సాధానోద్యమం, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరు సల్పిన యోధుడు పి. సుబ్బారావు . ప్రత్యేక తెలంగాణ కోసం అడుగులేసినోడు, ప్రకృతి ప్రేమికుడు, పుస్తకాలు పురుగు కామ్రేడ్ సుబ్బారావు.

దోపిడీ, పీడన, అసమానతలు ఉన్నంత వరకు ప్రజా పోరాటాలు ఉంటాయాని విశ్వసించినోడు, ప్రజా ఉద్యమ కారులను, విప్లవ కారులను కుట్ర కేసుల్లో రాజ్యం నిర్బందించినప్పుడు, ప్రజలపై పాలకులు పాశవిక చర్యలకు పూనుకున్నప్పుడు మానవ హక్కులకోసం కొట్లాడినోడు సుబ్బారావు సార్. తను నమ్మిన విలువలను మార్క్సిస్ట్ వర్గ దృక్పదాన్ని కడ వరకు ఆచరించిన కృషివలుడు కామ్రేడ్ సుబ్బారావు,

మానవతావాది, హక్కుల నేత కామ్రేడ్ పి.సుబ్బారావు ప్రజా జీవితం ఆచరణీయం. స్ఫూర్తి దాయకం. అయన లేని లోటు ప్రజా,హక్కుల సాంస్కృతికొద్యమానికి తీరని నష్టం. అయన మృతికి సీపీఐ (యం-యల్)న్యూడెమోక్రసీ నల్లగొండ జిల్లా కమిటీ విచారం వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపం ప్రకటిస్తూ విప్లవ జోహార్లు అర్పించింది.కుటుంబ సభ్యులకు, హక్కుల కార్యకర్తలకు సానుభూతి తెలిపింది.

# నార్కట్‌పల్లిలో ధాన్యం కొనుగోలుపై సమీక్ష



## రైతులకు ఇబ్బంది ఉండొద్దు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )

నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేసి, ఎలాంటి ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కావాల్సిన లారీలు, హమాలీల అందుబాటు, ధాన్యం నిల్వ, తరలింపు ప్రక్రియతో పాటు కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు.

# పవన్ భాష తీరు సరిగా లేదు..



## తెలంగాణ లో విద్వేషాలు పెట్టే ప్రయత్నం చేయొద్దు

### తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )

నల్గొండ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చిట్ చాట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ..పవన్ కళ్యాణ్ సభ పెట్టడం సరైన సమయం కాదు. ఓ వైపు తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతుంటే పవన్ సభ ఏంటి. పవన్ భాష తీరు సరిగా లేదు. చంద్రబాబు ,కూటమి నేతలు అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అంటున్నారు. అందుకే సీఎం , డిప్యూటీ సీఎం, మంత్రులు అమరావతి లోనే నివాసం ఉండాలి. తెలంగాణ కన్నా ఏపీ లో ఎక్కువ సోర్స్ ఉన్నాయి. సముద్ర తీరం ఉంది. రకరకాల పోర్టులు ఉన్నాయి. ఏపీ అభివృద్ధి చూసుకోవాలి తప్ప తెలంగాణ వైపు చూడొద్దని పేర్కొన్నారు. పరస్పర దూషణలు సరైంది కాదు. తెలంగాణ లో విద్వేషాలు పెట్టే ప్రయత్నం చేయొద్దు. తెలంగాణ లో 75% ధాన్యం సేకరణ పూర్తి అయిందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం సహకరించడం లేదు అందువల్లే కొంత ఆలస్యమైంది.పంట మార్పిడి వైపు రైతులు దృష్టి సారించాలి. వరి, పత్తి తప్ప ఏ పంటలు పండించడం లేదు అన్నారు.

# సమ సమాజ్ పార్టీ (ఎస్. ఎస్.పి) జిల్లా అధ్యక్షుల నియామకం

## బొల్గూరి కిరణ్ కుమార్, సమ సమాజ్ పార్టీ (ఎస్. ఎస్.పి)వ్యవస్థాపక అధ్యక్షులు

నల్లగొండ బ్యూరో, జూన్ 4 (వార్తా వేదిక సూర్య )

తెలంగాణ రాష్ట్రంలో నూటికి 85% ఉన్న పేదవర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా, మహానీయులు కారల్ మార్క్స్, డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్, పెరియార్ రామస్వామి ల సిద్ధాంత, రాజకీయ వెలుగులో "సమానత్వ వాద" సిద్ధాంతంతో ప్రజలను చైతన్యం చేసి "సమసమాజాన్ని" నిర్మిస్తామని ఆ లక్ష్య సాధనకై సబ్బండ వర్గాలను సిద్ధం చేయుటకై, ప్రజలలో విస్తృత స్థాయిలో పార్టీ "లైను" ను ప్రచారం చేయుటకై, పార్టీని నడిపించుటకై తెలంగాణలోని పలు జిల్లాల అధ్యక్షుల నియామకాలను సమ సమాజ్ పార్టీ (ఎస్. ఎస్.పి) వ్యవస్థాపక అధ్యక్షులు బొల్గూరి కిరణ్ కుమార్ చేపట్టడం జరిగింది. ఈ నియామకాలు గురువారం నుండి అమలులోకి వస్తాయని తెలియజేశారు.

ఎస్.ఎస్.పి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన వారు తక్షణమే జిల్లా కమిటీల, నియోజకవర్గ కమిటీల, మండల కమిటీల, గ్రామ కమిటీల, నిర్మాణంపై దృష్టి సారించాలని, పార్టీ విస్తరణకు, ప్రజా సమస్యల పరిష్కారాలపై, పార్టీ డైరెక్షన్లో ప్రజల చైతన్యంకై కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అధ్యక్షులు - జిల్లాలు



1) బి. నవీన్ కుమార్ - గ్రేటర్ హైదరాబాద్ ( హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలు)
2) ఎన్. బాలరాజ్ - నిజామాబాద్ జిల్లా
3) ఎమ్. శ్రీకాంత్ - కామారెడ్డి జిల్లా
4) బి. అనిల్ కుమార్ - నల్లగొండ జిల్లా
5) యు. పరశురామ్ - యాదాద్రి భువనగిరి జిల్లా

# బోయినపల్లి సర్కిల్ డిసి డాక్యా నాయక్ తో మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ భేటీ

సికింద్రాబాద్, జూన్ 04(వార్తా వేదిక సూర్య)



బోయినపల్లి సర్కిల్ డిసి డాక్యా నాయక్ తో గురువారం మోండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ భేటీ అయ్యారు. అనంతరం రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని పలు అభివృద్ధి పనుల పై చర్చించి వినతి పత్రం అందచేశారు. దినికి డిసి డాక్యా నాయక్ సానుకూలంగా స్పందించినట్లు మాజీ కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు ఉన్నారు

సంపుటి : 2 సంచిక: 16 వార్త వేదిక సూర్య హైదరాబాద్ శుక్రవారం, జూన్ 05, 2026



# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

## - భవాని కాలనీలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పర్యటన

## - మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో రూ.2.51 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు

రాజేంద్రనగర్, జూన్ 04 ( వార్త వేదిక సూర్య ) :




మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని భవాని కాలనీలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పర్యటించి, రూ. 2 కోట్ల 51 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన రోడ్ల నిర్మాణ పనుల ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, జీహెచ్ఎంసీ ఈఈ నాగేందర్ గౌడ్‌తో కలిసి కాలనీలోని పలు ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే, రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టే విధంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, భవాని కాలనీ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 2.51 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. పనులను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు భవాని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ (బీసీడబ్ల్యూ ఎ ) ప్రెసిడెంట్ ఎం .శ్రీనివాస్ యాదవ్ ,

జనరల్ సెక్రెటరీ అక్కేమ్ కృష్ణ యాదవ్ చంద్రకాంత్ రావు , సతీష్ కుమార్ , ఐజాజ్ , రూపేష్ , నరోత్తం రెడ్డి , వెంకటేశ్వర రావు , సత్యనారాయణ రెడ్డి , సుగుణ చంద్ , వెంకట్ రావు , గోవిందా రాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ వరం: కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ పూలపల్లి కృష్ణారెడ్డి

రాజేంద్రనగర్, జూన్ 04 (వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట్ మండలం పరిధిలోని విద్యానగర్ నివాసి సయ్యద్ నజీర్ చికిత్స నిమిత్తం మంజూరైన రూ. 3 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎం ఆర్ ఎఫ్ ) లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ ఒ సి ) కాపీని గురువారం నాయకులు లబ్ధిదారునికి అందజేశారు. జిహెచ్ఎంసి 123 డివిజన్ పరిధిలోని విద్యానగర్‌కు చెందిన సయ్యద్ నజీర్ అనారోగ్యంతో నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు గౌరవనీయులైన రాజేంద్రనగర్ శాసనసభ సభ్యులు టి. ప్రకాష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుండి రూ. 3,00,000/- విలువైన ఎల్ఓసీ మంజూరైంది. ఈ ఎల్ఓసీ ప్రతులను జిహెచ్ఎంసి 121, 122, 123 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి గారు మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్ కలిసి లబ్ధిదారుడు సయ్యద్ నజీర్ కి అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల వల్ల పేద ప్రజలు వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నిరంతరం శ్రమిస్తున్నారని, సీఎంఆర్ఎఫ్ నిధులు పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాంప్రసాద్ గారితో పాటు డివిజన్ పరిధిలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# సార్ ప్రక్రియ పారదర్శకంగా సాగితేనే ప్రజాస్వామ్యానికి బలం

## : బీజేపీ రాష్ట్ర నాయకుడు సొల్కర్ రెడ్డి

## - ఓటరు జాబితా సవరణల్లో సమానత్వం, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం కీలకమని సూచన



రాజేంద్రనగర్, జూన్ 04 ( వార్త వేదిక సూర్య ) :

ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల నిర్వహణతో ముగిసిపోదని, ప్రజల విశ్వాసం, పారదర్శకత, సమానత్వం వంటి విలువలపై ఆధారపడి ఉంటుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు సొల్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ (సార్ ) ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి అవసరమైన సంస్కరణ అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల్లో డూప్లికేట్ పేర్లు, మరణించిన వ్యక్తుల పేర్లు కొనసాగడం, ఒకే వ్యక్తి రెండు చోట్ల నమోదు కావడం వంటి లోపాలను సరిదిద్దేందుకు సార్ అవసరమని ఆయన తెలిపారు. అయితే, ఈ ప్రక్రియ అమలులో రాజకీయ ఆరోపణలు, విమర్శలు రావడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు. అధికార పార్టీలు సార్‌ను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెబుతుండగా, ప్రతిపక్షాలు మాత్రం కొన్ని వర్గాల ఓటర్లను లక్ష్యంగా చేసుకుని పేర్ల తొలగింపులు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆరోపణల నిజానిజాలు పక్కన పెడితే, ప్రజల్లో అనుమానం కలగడం కూడా ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు.

గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం, అవసరమైన పత్రాల సమర్పణలో ఇబ్బందులు, డిజిటల్ వ్యవస్థలపై పరిమిత పరిజ్ఞానం వంటి కారణాలతో పలువురు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. టెక్నాలజీ వినియోగం వల్ల సార్ ప్రక్రియ వేగవంతమవుతున్నప్పటికీ, వ్యక్తిగత సమాచార భద్రతపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. డేటా గోప్యతకు సంబంధించిన స్పష్టమైన విధానాలు, పారదర్శక చర్యలు అమలు చేయాలని కోరారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా సార్ విజయవంతం కాదని, ముఖ్యంగా యువత కొత్త ఓటర్ల నమోదులో, వివరాల సవరణలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా, ఓటరు జాబితా సవరణల వంటి కీలక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ను కేవలం పరిపాలనా ప్రక్రియగా కాకుండా ప్రజాస్వామ్యాన్ని బలపరిచే సాధనంగా చూడాలని సొల్కర్ రెడ్డి పేర్కొన్నారు. పారదర్శకత, సమగ్రత, సమానత్వం అనే మూడు సూత్రాలను పాటించినప్పుడే సార్ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటుందని చెప్పారు. ప్రతి ఓటరు విలువైనవాడనే భావనతో వ్యవహరించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# చెరువులను కబ్జాల నుంచి రక్షించాలి: ఆడికే మహేందర్



## - నిధులు కేటాయించి సుందరీకరణ చేపట్టాలి

## - జోనల్ కమిషనర్, స్థానిక ఎమ్మెల్యేకు చెరువుల పరిరక్షణ సమితి విజ్ఞప్తి

రాజేంద్రనగర్, జూన్ 04 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని వివిధ డివిజన్లలో ఉన్న చెరువులను కబ్జాల నుంచి రక్షించి, వాటి సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆడికే మహేందర్ ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి చెరువుల పరిరక్షణ అంశాన్ని తీసుకువెళ్లామని, చెరువుల సరిహద్దులను గుర్తిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, వాటి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని నిరంతరం విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. గతంలో చార్మినార్ జోనల్ కమిషనర్‌గా పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 'నర్సాబాయి కుంట' అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ, కొన్ని కారణాలతో పనులు నిలిచిపోయాయని మహేందర్ గుర్తు చేశారు. ప్రస్తుతం అదే అధికారి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఇక్కడి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని, నిలిచిపోయిన నర్సాబాయి కుంట పనులను కూడా ఆయన పూర్తి చేయించాలని కోరారు. గతంలో చార్మినార్ జోనల్ కమిషనర్‌గా పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 'నర్సాబాయి కుంట' అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ, కొన్ని కారణాలతో పనులు నిలిచిపోయాయని మహేందర్ గుర్తు చేశారు. ప్రస్తుతం అదే అధికారి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఇక్కడి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని, నిలిచిపోయిన నర్సాబాయి కుంట పనులను కూడా ఆయన పూర్తి చేయించాలని కోరారు. జోన్ పరిధిలోని పల్లె చెరువు, బుల్బుల్ కుంట, మద్దికుంట, ఎర్రకుంట, ఊర చెరువు, మామిడి కుంట, పత్తికొండ చెరువుల అభివృద్ధికి కూడా ప్రత్యేక నిధులు కేటాయించి, చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, పచ్చదనంతో సుందరీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చెరువులను ఆక్రమణల కోరల నుంచి రక్షించి, భవిష్యత్ తరాలకు సహజ వనరులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆడికే మహేందర్ స్పష్టం చేశారు.

# యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలి



## - ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## - క్రీడాస్ఫూర్తి, పట్టుదల, క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

## - విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన ముగింపు వేడుక

రాజేంద్రనగర్, జూన్ 04 (వార్త వేదిక సూర్య ) :



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) శంషాబాద్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్-2026" ముగింపు వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ 25 నుంచి మే 31 వరకు జరిగిన ఈ వేసవి క్రీడా శిబిరంలో వందలాది మంది విద్యార్థులు, యువత పాల్గొని వివిధ క్రీడాంశాల్లో తమ ప్రతిభను చాటు కున్నారు. ముగింపు కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసాన్ని కూడా పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నేటి యువత మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ యువతకు మంచి వేదికగా నిలిచిందని, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, పాల్గొనడం ద్వారా పొందే అనుభవం జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్" లక్ష్యాలకు అనుగుణంగా యువత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడా రంగంలో ప్రతిభ కనబరిచే వారికి అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. నేటి క్రీడాకారులే రేపటి తెలంగాణ, దేశ గర్వకారణమని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, జిహెచ్ఎంసి సంయుక్త ఆధ్వర్యంలో "తెలంగాణ రైజింగ్" కార్యక్రమం మరియు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. శిబిరంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో శిక్షణ అందించడంతో పాటు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, క్రీడా శిక్షకులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, క్రీడాకా రులు పాల్గొన్నారు. విజేతలను సన్మానించడంతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరిని అభినందిస్తూ కార్యక్రమం ముగిసింది.

# కాలుష్యం నియంత్రణకు సమిష్టి కృషి అవసరం

## - చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు అడికే మహేందర్

రాజేంద్రనగర్, జూన్ 04 ( వార్త వేదిక సూర్య ) :



చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షులు అడికే మహేందర్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది ఒక రోజు కార్యక్రమం కాదని, అది ప్రతి పౌరుడి జీవితంలో భాగంగా మారాల్సిన అత్యంత కీలకమైన బాధ్యత అని స్పష్టం చేశారు. పెరుగుతున్న కాలుష్యం, అరణ్య నాశనం, చెరువుల ఆక్రమణలు, నీటి వనరుల దుర్వినియోగం వంటి సమస్యలు భవిష్యత్ తరాలకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులు, కుంటలు, నదులు వంటి సహజ వనరులు కేవలం నీటి నిల్వలు మాత్రమే కాకుండా గ్రామీణ జీవనానికి జీవాధారంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. వీటి సంరక్షణ లేకపోతే వ్యవసాయం, తాగునీటి అవసరాలు, జీవవైవిధ్యం అన్నీ ప్రమాదంలో పడతాయని ఆయన హెచ్చరించారు. ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా చెట్లు నాటడం, నీటి వనరులను కాపాడడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, కాలుష్య నియంత్రణకు సహకరించడం వంటి చర్యలను తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చిన్న చిన్న చర్యలే పెద్ద మార్పులకు దారి తీస్తాయని, సమిష్టి కృషితోనే పర్యావరణాన్ని రక్షించగలమని ఆయన స్పష్టం చేశారు. యువత ఈ ఉద్యమంలో ముందుండాలని, పాఠశాలలు, కాలేజీలు, కాలనీలు, గ్రామాల్లో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. చెరువుల పునరుద్ధరణ, పచ్చదనం పెంపు, నీటి సంరక్షణ వంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఆయన కోరారు. చివరగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని కాపాడటం అంటే మన భవిష్యత్‌ను కాపాడటమేనని, పర్యావరణ పరిరక్షణను నిరంతర ఉద్యమంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు

సంపుటి : 2 సంచిక: 16 వార్త వేదిక సూర్య హైదరాబాద్ శుక్రవారం, జూన్ 05, 2026



# తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు

రాజేంద్రనగర్, జూన్ 04 ( వార్త వేదిక సూర్య ) :

తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్రవార్త ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ ని శాలువాతో సత్కరించి, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, దీర్ఘాయుష్షు కలిగి ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఆయన మరిన్ని సేవలు అందించాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రానికి మరింత సేవ చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి మాజీ ఎంపీపీ, ఆంజనేయులు మాజీ ఉపసర్పంచ్, విజయ్ బాబు కోకాపేట మాజీ వైస్ చైర్మన్ , హరిశంకర్ మాజీ సర్పంచ్, భాస్కర్ మాజీ జడ్పీటీసీ , నరసింహ మాజీ సర్పంచ్ తో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని స్పీకర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంకం శ్రీనివాస్

రాజేంద్రనగర్, జూన్ 04 ( వార్త వేదిక సూర్య ) :



తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంకం శ్రీనివాస్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అంకం శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజా సేవలో అంకితభావంతో పనిచేస్తూ శాసనసభ గౌరవాన్ని మరింత పెంచుతున్న గడ్డం ప్రసాద్ కుమార్ గారు ప్రజల అభిమానాన్ని చూరగొన్న నాయకుడని కొనియాడారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి మీరు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ, మీకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ మీ వెంట ఉండాలని కోరుకుంటున్నాం" అని అంకం శ్రీనివాస్ పేర్కొన్నారు.

# ప్రజాధనం దుర్వినియోగం కావడానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బాధ్యుడు

**రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ధ్వజం**

**- రెండు దశాబ్దాలు దాటినా పూర్తికాని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్!**

**- రూ. 30 కోట్లు ఖర్చు చేసినా ప్రజలకు దక్కని ఫలితం.**

**- నర్సబాయికుంట సుందరీకరణ నిధులు పందికొక్కులు మేసేశాయి.**

**- పనుల పేరుతో అనుచరులకు బిల్లులు దోచిపెడుతున్నారంటూ తీవ్ర విమర్శలు.**






రాజేంద్రనగర్, జూన్ 04 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పేరుతో ప్రజాధనం భారీగా దుర్వినియోగం అవు తోందని, దీనికి స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బాధ్యత వహించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. నియోజక వర్గంలో పనులు జరగకపోయినా, ఎమ్మెల్యే తన అనుచరులైన కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయించుకుంటూ లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. రూ. 30 కోట్లు దాటినా పూర్తికాని స్పోర్ట్స్ కాంప్లెక్స్

రెండు దశాబ్దాల క్రితం (18-03-2007 నాడు) అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రూ. 5 కోట్ల అంచనా వ్యయంతో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులకు శ్రీకారం చుట్టారని కార్తీక్ రెడ్డి గుర్తుచేశారు. ఆ నిధులు సరిపోకపోవడంతో మరో ఐదు కోట్లు.. ఇలా నాలుగు సార్లు అంచనాలు పెంచుకుంటూ దాదాపు రూ. 20 నుంచి 30 కోట్ల వరకు ప్రజాధనాన్ని ఖర్చు చేశారన్నారు. అయినా నేటికీ ఈ కాంప్లెక్స్ స్థానిక యువతకు అందుబాటులోకి రాలేదని మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒకటే అన్నట్లుగా ఎమ్మెల్యే వ్యవహారం ఉందని, పనులు పూర్తి కాకుండానే కేవలం ఎన్నికల లబ్ధి కోసమే ఆగమేఘాలపై దీనిని ప్రారంభించారని, ఈ మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. పదేళ్ల క్రితం (06-05-2016 నాడు) రూ. 1 కోటి 15 లక్షల 35 వేల అంచనాలతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వయంగా నర్సబాయికుంట సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారని కార్తీక్ రెడ్డి తెలిపారు. కొన్ని రోజులు జేసీబీతో భూమిని చదును చేసి, నిధులు సరిపోవడం లేదనే నెపంతో మళ్లీ మరో కోటి రూపాయలు మంజూరు

చేయించారన్నారు. తీరా చూస్తే ఒక తూము వద్ద రెండు కాంక్రీట్ దిమ్మలు కట్టి, చెరువు కట్టకు రాళ్లు పేర్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సబాయికుంట సుందరీకరణ కోసం వచ్చిన సుమారు రెండు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పందికొక్కులు మేసినట్లుగా నాయకులు, కాంట్రాక్టర్లు తిన్నారే తప్ప అక్కడ 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా ఉందని చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. నర్సబాయికుంట సుందరీకరణ మరియు పార్కు ఏర్పాటు కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టకుండా, పనులు సక్రమంగా జరిగేలా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దృష్టి పెట్టాలని స్థానిక బస్తీల ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పటికైనా నిధుల దుర్వినియోగాన్ని అరికట్టి, నాణ్యమైన పనులు పూర్తి చేయకపోతే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాడుతామని కార్తీక్ రెడ్డి హెచ్చరించారు.

# సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో శక్తివంతమైన ఆయుధం

**- ఆర్ టీ ఐ చట్టాన్ని వినియోగించుకొని ప్రతి పౌరుడు తన హక్కులను సాధించుకోవాలి**

**- జాతీయ సహాయ కార్యదర్శిగా అన్నవరం సందీప్ రెడ్డి నియామకం**



రాజేంద్రనగర్, జూన్ 04 ( వార్త వేదిక సూర్య ) :

ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం మరియు ప్రజల హక్కుల పరిరక్షణకు సమాచార హక్కు చట్టం ( ఆర్ టీ ఐ )అత్యంత ప్రభావవంతమైన సాధనమని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ సహాయ కార్యదర్శిగా అన్నవరం సందీప్ రెడ్డి నియమితులైన





సందర్భంగా హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం-2005 ప్రజలకు ప్రభుత్వ శాఖలు, సంస్థలు మరియు అధికారుల పనితీరుపై సమాచారం పొందే హక్కును కల్పించిందన్నారు. ప్రజా ధన దుర్వినియోగం, అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకురావడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడంలో ఆర్ టీ ఐ చట్టం ఎంతో ఉపయోగకరమని, ప్రతి పౌరుడు దీనిపై అవగాహన పెంపొందించుకొని అవసర మైనప్పుడు వినియోగించుకోవాలని సూచిం చారు. దేశవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ద్వారా ప్రజలకు న్యాయ సహాయం అందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై పర్యవేక్షణ చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతోందని ఆయన తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి మాట్లాడుతూ, యువత మరియు సామాజిక కార్యకర్తలు సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు. సమాజంలో పారదర్శకతను పెంపొం దించడంలో ఆర్ టీ ఐ చట్టం గొప్ప సాధనమని అన్నారు. నూతనంగా నియమితులైన జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి మాట్లాడుతూ, సంస్థ లక్ష్యాల సాధన కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. దేశవ్యాప్తంగా కమిటీల బలోపేతంతో పాటు సమాచార హక్కు చట్టంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చింతల రాఘవేందర్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, రాష్ట్ర కార్యదర్శులు అజయ్ కుమార్, నవీన్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కార్తీక్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అశోక్ కుమార్, అరవింద్ స్వామి, శివ కుమార్, బాపయ్య, మారుతి స్వామి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బోగం విష్ణు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్డేటి ప్రవీణ్, దీపక్ కులకర్ణి, సంపత్ ముదిరాజ్, సుధీర్ రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి నూతన డీఈఓను కలిసిన బీఆర్ఎస్వీ నాయకులు అఖిల్



**సంగారెడ్డి, జూన్ 4వార్తా వేదికసూర్య :** సంగారెడ్డి జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రోహిణి ని బిఆర్ఎస్వి నాయకులు అఖిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లాలో విద్యా రంగ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అఖిల్ కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బత్తుల విక్రమ్, సాయి పాల్గొన్నారు.

# ట్రాన్స్ ఫార్మర్ మెయిన్ వైరు తెగడంతో విద్యుత్ షాక్ కు గురై గేదె మృతి



**రామన్నపేట, జూన్ 4(వార్త వేదిక సూర్య):** రామన్నపేట గాలి దుమారం రావడంతో ట్రాన్స్ ఫార్మర్ మెయిన్ వైరు తెగి పాడి గేదె మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేస్తుంది. వివరాల ప్రకారం మండలంలోని పల్లివాడ గ్రామానికి చెందిన నాగులంచ శేఖరయ్య తన వ్యవసాయ భూమిలో గేదెలను మేపుతుండగా అకస్మాత్తుగా గాలి దుమారం రావడంతో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న ట్రాన్స్ఫార్మర్ మెయిన్ వైర్ తెగి గేదెపై పడడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందిందని రైతు తెలిపారు. విద్యుత్ అధికారులుసంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. పాడి గేదే ఖరీదు దాదాపు లక్ష రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని రైతు కోరారు.

# విద్వేషాలను పవన్ కళ్యాణ్ రెచ్చగొట్టడం తెలంగాణ సమాజం క్షమించదు

**మోత్కూరు, జూన్ 04 (వార్త వేదిక సూర్య):**




ప్రతినిత్యం కమ్యూనిస్టులు చేస్తున్న పార్టీలు ప్రజాపోరాటాలపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వాఖ్యలు బాధ్యతారాహిత్యమని సిపిఎం మండల కమిటీ సభ్యులు కురిమేటి యాదయ్య గురువారం ఒక ప్రకటనలో అన్నారు.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేలా పీడీత ప్రజల వర్గ పోరాటాలను అవమానించే విధంగా మాట్లాడటం బాధ్యతయుతమైన పదవిలో ఉన్న వ్యక్తికి తగదన్నారు. కమ్యూనిజం చచ్చిపోయిందని పవన్ కళ్యాణ్ మాట్లాడటం ఆయన రాజకీయ అజ్ఞానాన్ని, అవివేకాన్ని తెలియజేస్తుందన్నారు., ప్రపంచంలో పెట్టుబడిదారులు దోపిడీవర్గాలు ఉన్నత కాలం శ్రామికవర్గాల తరుపున ఎర్రజెండా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. కేవలం కొన్నిచోట్ల పదవులు ప్రభుత్వాలు కోల్పోయినంత మాత్రాన సిద్ధాంతాలు నశించిపోవని, ఈ దేశంలో దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా కుల మత ప్రాంతీయాలకు అతీతంగా శ్రామికవర్గ రాజ్యస్థాపన కోసం సిపిఐ (యం) పోరాడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టేలా ఆయన చేస్తున్న చర్యలను తెలంగాణ సమాజం క్షమించదన్నారు , ఇప్పటికైనా ఆయన వాఖ్యాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# రియల్ ఎస్టేట్ యూనియన్ అధ్యక్షులుగా మురళి ఎన్నిక



**మోత్కూరు, జూన్ 04 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మండల రియల్ ఎస్టేట్ యూనియన్ గురువారం మున్సిపల్ నిర్వహించారు. గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న పాత కమిటీని రద్దుచేసి నూతన కార్యవర్గని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గడ్డం సోమ నర్సయ్య, ఎం.డి. మహ్మద్ అలీ , సూధగాని పాండు, అధ్యక్షులుగా గాదగాని మురళి, ఉపాధ్యక్షులుగా చోల్లేటి నరేష్, కన్నెబోయిన కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బండారు వేణు, కార్యదర్శులుగా ఎండి ఖలీల్, చిప్పలపల్లి రమేష్, కోశాధికారిగా కారుపోతుల వెంకన్న గౌడ్,లీగల్ యాక్షన్ కమిటీ జినుకల కనకయ్య ,బోడ బాబురావు, బొమ్మగాని ఉప్పలయ్య, కడమంచి వీరస్వామి, కార్యవర్గ సభ్యులుగా దామరోజు సోమలింగాచారి, జంగ సురేష్, పులసాని సతీష్ రెడ్డి, సామల ప్రకాష్ రెడ్డి, పల్లె భిక్షం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నూతన అధ్యక్షులు మురళి తెలిపారు.

# 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై అవగాహన





**మహేశ్వరం జూన్ 4 వార్త వేదిక సూర్య :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, వర్షాకాల సన్నద్ధత, త్రాగునీరు, జల సంరక్షణే మన సంరక్షణ, హరితహారం అంశాలపై ప్రత్యేక గ్రామ సభను గురువారం మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) కిరణ్మయి, హాజరయ్యారు. గ్రామ సభలో వివిధ శాఖల అధికారులు పాల్గొని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఫార్మర్ యాప్ ద్వారా ఎరువులు సులభంగా పొందవచ్చని వివరించారు. అలాగే హార్టికల్చర్ శాఖ ద్వారా పామాయిల్, మామిడి, బొప్పాయి వంటి పండ్ల తోటలను పెంచే రైతులకు 50 శాతం సబ్సిడీ అందుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇంటి నుంచి వెలువడే చెత్తను ఆకు పచ్చ రంగు బుట్టలో తడి చెత్త, నీలం రంగు బుట్టలో పొడి చెత్త, నారింజ రంగు బుట్టలో శానిటరీ చెత్త, నలుపు రంగు బుట్టలో ప్రత్యేక లేదా హానికర చెత్తను వేర్వేరుగా వేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్కు అందించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి కుటుంబం ఇంటి నుంచే చెత్తను వేరు చేసే అలవాటు చేసుకోవాలని కోరారు.

మహేశ్వరం మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో చెత్త సేకరణకు ప్రస్తుతం ఒకే ట్రాక్టర్ ఉండడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామ ప్రజలు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆమె, అదనపు వాహనాల కొనుగోలు అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గ్రామంలో ఉన్న ఇతర సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, ఏసీపీ మహేశ్వరం జానకి రెడ్డి , ఎంపీడీఓ మహేశ్వరం ఎన్.శారదమ్మ, ఎమ్మార్వో మహేశ్వరం చిన్న అప్పల నాయుడు , ఎంపీఓ మహేశ్వరం ఎన్.రవీందర్ రెడ్డి, సీఐ మహేశ్వరం రాఘవేందర్ రెడ్డి, సీడీపీఓ మహేశ్వరం శాంతశ్రీ హాజరయ్యారు. ఈ కార్యక్రమములో గ్రామ సర్పంచ్ మునగ పాటి నవీన్, ఉప సర్పంచ్ జొరల రమేశ్, వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టమ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమోని స్వాతి, వత్తుల శాలిని, కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరిబాబు, సున్నం స్వప్నా, జటావత్ రుకేష్, రెవెళ్ళ చంద్రమౌళి, నాయకులు అల్లే కుమార్, వత్తుల రఘుపతి, వనంపల్లి శ్రావణ్, బంగారిగల్ల లాజర్, స్వర్ణగంటి సుభాష్, అల్లే భిక్షపతి, కటికల శ్రీహరి, షైక్ హాజిబాబా, పెద్దలు మిద్దింటి సురేశ్, మిద్దింటి యాదగిరి, దుద్దు కృష్ణ యాదవ్, కాకి నాగేష్, సున్నం కృష్ణ, ఆవులకాడి శ్రీశైలం, ఆవులకాడి మహేష్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్స్ గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు మరియు పంచాయతీ కార్యదర్శి ఎస్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించడానికే గ్రామ పంచాయతీలలో గ్రామసభలు



**మోత్కూరు: 04 ( వార్త వేదిక సూర్య) :** ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలనే రాష్ట ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పాటిమట్ల, అనాజీపురం ,ముషిపట్ల,రాగి బావి గ్రామ పంచాయతీలలో గురువారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామపంచాయతీలో సర్పంచులు బండ రమ్మ, బీసు వెంకటయ్య,, పైళ్ల నర్సిరెడ్డి, మెండు. శ్రీవాణి అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. ఉప సర్పంచులు వార్డు సభ్యులు, గ్రామస్తులు ఎంపీడీవో,బాలాజీ తహశీల్దార్ జ్యోతి,డీ ఈ.ఆర్ బ్ల్యూఎస్, మంగోలాల్ మండల వ్యవసాయ అధికారి వడ్డేమాన్ కీర్తి, ఏ ఈ పి ఆర్, హౌసింగ్ ఏఈ, అఖిల్ హార్టికల్చర్ ఆఫీసర్, సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్, ఎలక్ట్రికల్ డిపార్ట్ మెంట్ మెడికల్ ఆఫీసర్ పంచాయతీ కార్యదర్శి,ఉపాధి హామీ అంగన్వాడి ఐకెపి శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికే ఈ ప్రత్యేక సభలో నిర్వహించినట్లు తెలిపారు. రానున్న వర్షాకాలశీ దృష్టిలో ఉంచుకొని వ్యవసాయానికి సంబంధించిన పంట మార్పిడి విధానాలు, పారిశుద్ధ్య తాగునీరు,ఆరోగ్యానికి సంబంధించిన అంటివ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు శాంతిభద్రతలు సంబంధించిన సూచనలు ఉపాధి హామీలు వ నమోత్సవం గురించి ఉపాధి హామీలు తోటల పెంపకం గురించి హార్టికల్చర్ తోటలకు సంబంధించి, సోలార్ విద్యుత్ సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

# ప్రజా సమస్యలపై వార్డులలో అవగాహన



**మోత్కూరు, జూన్ 04 (వార్త వేదిక సూర్య );** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మున్సిపల్ కేంద్రంలోని 6, 7,8 వార్డులలో గురువారం వార్డు సభలు మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య పాల్గొని ప్రజా సమస్యలు ఎక్కడ ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026 జల్ సంజయ్ జల్ భగీరథ పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుట మురికి కాలువల శుభ్రం చేయుట పూడిక తీయు పనులు, వర్షాకాల సంసిద్ధతపై నీరు నిలువ ప్రాంతాల నివారణ,పారిశుధ్యం రోడ్ల నిర్వహణ వీధి దీపాలు, మొక్కలు పర్యావరణ సంరక్షణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జి.నర్సయ్య, వార్డు కౌన్సిలర్లు గనగాని శైలజ, పన్నాల శ్రీవిద్య, వార్డు అధికారులు శ్రావణ్ రెడ్డి, సుప్రియ రెడ్డి, మున్సిపల్ , మెస్మా , పోలీస్,అంగన్వాడి సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామసభలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించిన ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**వలిగొండ, జూన్ 4 (వార్తా వేదిక సూర్య) :** వలిగొండ మండలం నాగారం గ్రామంలో గ్రామ సభ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యక్షంగా సమావేశమై తెలంగాణ ప్రభుత్వ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ మరియు అభివృద్ధి పథకాల గురించి అవగాహన కల్పించారు. అలాగే ఇప్పటివరకు పొందిన ప్రయోజనాలు పథకాల అమలు పరిస్థితి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో జలంధర్ రెడ్డి. మండల విద్యాధికారి భాస్కర్, ఏపీవో పరశురాములు, ఏపీఎం, ఏఈ పంచాయతీరాజ్ ఏఈ,ఆర్డబ్ల్యుసి హౌసింగ్ ఏఈ, ఇరిగేషన్ మండల స్థాయి అధికారులు . గ్రామ సర్పంచ్ ,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వైద్యాధికారులు, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్స్, గ్రామ పెద్దలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాల బోధన, ఆయా పోస్టులకు జూన్ 16 లోగా దరఖాస్తులు చేసుకోవాలి

**- ఎంఈఓ సత్యనారాయణ**



**మోత్కూరు, జూన్ 04 ( వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంతో పాటు దాచారం ప్రాథమిక పాఠశాలలలో ఈ విద్యా సంవత్సరం నుండి ఫ్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎంఈఓ టి. సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 సంవత్సరాల నిండిన విద్యార్థులకు పూర్వ ప్రాథమిక తరగతులలో బోధించుటకు ఉపాధ్యాయులు, ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని , 18 సంవత్సరాల నుండి 44 సంవత్సరాల లోపు మహిళ అభ్యర్థులు ఈనెల 16 లోపు నిర్ణీత దరఖాస్తుతో పాటు సంబంధించిన ధ్రువపత్రాలను జతపరిచి ఎం ఆర్ సి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఫ్రీ ప్రైమరీ తరగతులను బోధించుటకు ఇంటర్మీడియట్, తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఆయా పోస్టులకు7వ,తరగతి ఉత్తీర్ణత మార్కుల మెమో సమర్పించాలన్నారు. ఈ దరఖాస్తులను ఆయాపాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద లభిస్తాయని పేర్కొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- సర్పంచ్ హనుమంత్ నాయక్, ఉపసర్పంచ్ తేజ నాయక్,**



**మహేశ్వరం జూన్ 4 వార్త వేదిక సూర్య :**

మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం దావూద్ గూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన సర్పంచ్ హనుమతునాయక్, ఉపసర్పంచ్ ఆర్ తేజ నాయక్, ఆధ్వర్యం లో కార్యక్రమంనిర్వహించబడింది

ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు క్రింది సూచనలు చేయబడినవిఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి,నిల్వ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలి,దోమల నివారణ కోసం అవసరమైన జాగ్రత్తలు పాటించాలి,మురుగు కాలువలు, డ్రైనేజీలలో చెత్త వేయకుండా చూడాలి,విద్యుత్ స్తంభాలు, వైర్లు దెబ్బతిన్నట్లయితే వెంటనే గ్రామపంచాయతీకి లేదా అధికారులకు సమాచారం ఇవ్వాలి,భారీ వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదు. తాగునీటిని మరిగించి వినియోగించాలి.చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి,గ్రామ ప్రజలందరూ వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి, గ్రామ పరిశుభ్రత ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని గ్రామ పంచాయతీ కోరింది

ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు వి. రవీందర్ నాయక్,చిన్న నాయక్, కందుకూర్ ఎఈ సతీష్ రెడ్డి, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఏ ఈ ఓ జగతీష్, కందుకూర్ పోలీస్ డిపార్ట్మెంట్, గ్రామ ప్రజలు పాల్గొనరు,

యాదాద్రి భువనగిరి
సంపుటి : 2 సంచిక : 16
# వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి
శుక్రవారం,
జూన్, 5, 2026

## రైతుల ధాన్యం కొనుగోలులో జాప్యం వద్దు

**- అధికారులను ఆదేశించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం**



**రామన్నపేట, జూన్ 4 (వార్తా వేదిక సూర్య) :** రామన్నపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం ఈ సందర్భంగా రైతులు అమ్మిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి, ఎలాంటి జాప్యం లేకుండా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.కావాల్సిన లారీలు, హమాలీల అందుబాటు, ధాన్యం నిల్వ, తరలింపు ప్రక్రియ, కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడుతున్న సమస్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం తెలిపారు.

## పల్లవి స్కూలుపై తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి

**- ఎంఈఓకు వినతి పత్రం అందజేత**
**- ప్రభుత్వ అన్ని అనుమతులతో పాఠశాల ప్రారంభం**
**- స్కూల్ అకాడమీ కోఆర్డినేటర్ జాల శ్రీవాణి వెల్లడి**



**రామన్నపేట,జూన్ 4(వార్త వేదిక సూర్య) :** రామన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్లవి స్కూల్ పై తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని స్కూల్ అకాడమీక్ కోఆర్డినేటర్ జాల శ్రీవాణి హితావు పలికారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ . గురువారం స్థానిక ఎంఈఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కొంతమంది స్కూల్ పై తప్పుడు ప్రచారాలు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని అన్నారు.ప్రభుత్వ అన్ని నియమ నిబంధనలతో స్కూల్ ని ప్రారంభిస్తున్నామని అన్నారు. పాఠశాలకు భంగం కలిగించి తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి పాఠశాల యాజమాన్యం వెనుకాడదని తెలిపారు.

## నూతన మున్సిపల్ కమీషనర్‌కు సన్మానం



**మోత్కూరు, జూన్ 04 ( వార్త వేదిక సూర్య ) :** ఇటీవల నూతన బాధ్యతలు చేపట్టిన మోత్కూరు మున్సిపల్ కమీషనర్ గోలుకొండ నర్సయ్య ను బీసీ రిజర్వేషన్ సాధన సమితి నియోజక వర్గ సాధన సమితి ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత, మాదిగ హక్కుల దండోరా మండల అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగేశ్వర్ లు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఆత్మీయ సన్మానం చేశారు.




# యాదగిరిగుట్ట 8వ వార్డులో వాటర్ ఫిల్టర్ ప్రారంభం





**యాదగిరిగుట్ట జూన్ 4 (వార్త వేదిక సూర్య) :** పట్టణంలోని 8వ వార్డు లో ప్రజల సౌకర్యార్థము వాటర్ ఫిల్టర్ ని మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యచరణలో భాగంగా యాదగిరిగుట్ట పట్టణంలో 1,2,3 వార్డు లలో, సభలు నిర్వహించడం జరిగింది. ఇట్టి వార్డు సభలలో గౌరవ చైర్పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై రానున్న వర్షాకాల రిత్యా ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రైనేజీలు చెత్త నిలవకుండా చూడాలని, చెత్త బండికి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వేయాలని మరియు ఇతర ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో వైస్ చైర్పర్సన్ బరిగే రమ్య రామచందర్, కమిషనర్ బి. శ్రీనివాస్, కౌన్సిలర్ బోడ రాధ, బూడిద మధు, కాటబత్తిని స్వప్న ఆంజనేయులు, మాలోతు హరీష్, కర్రే మాధవి ప్రవీణ్, పెలిమెల్లి లావణ్య శ్రీధర్, పెరబోయిన సత్యనారాయణ, సాదునేని ధనలక్ష్మి మధుకర్, ముక్కెర్ల మల్లేష్, బబ్బూరి శ్రీధర్, కో ఆప్షన్ సభ్యులు గౌలికర్ అరుణ రాజేష్, బండి జంగమ్మ, రహీమ సలాం, పురపాలక కార్యాలయ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

## మహేశ్వరంలో ప్రజా సమస్యలు పరిష్కరించండి

**- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం**
**ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు**



**మహేశ్వరం జూన్ 4 వార్త వేదిక సూర్య:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహేశ్వరం గ్రామపంచాయతీ ప్రాంగణంలో నిర్వహించిన గ్రామసభలో పలు సమస్యలపై వినతి పత్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వత్తుల రఘుపతి, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి, మహేశ్వరం గ్రామపంచాయతీ 1 వ వార్డు సభ్యులు టి. బేబీ మక్కాజి,మహేశ్వరం మాజీ ఉప సర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రెల రాములు ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల సీనియర్ నాయకులు 11 వ వార్డ్ ఇన్చార్జ్ గదగూటి జంగయ్య ముదిరాజ్,కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్, తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరం గ్రామ 2 వ వార్డు ఇంచార్జ్ గదగుటి మహేందర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మాజీ మండల అధ్యక్షుడు ఏపూరి నరసింహ, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు స్వర్ణ గంటి ఆకాష్, గ్రామ శాఖ ప్రచార కార్యదర్శి పినమోని శ్రీకాంత్ ముదిరాజ్,14 వ వార్డు ఇంచార్జ్ పుట్లగారి చందు, సీనియర్ నాయకులు సయ్యద్ భాషారత్ అలీ, దుంపల ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు ,

## పేద ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎంఆర్ఎఫ్ ఎంతో దోహదం



**మోత్కూరు,( అడ్డగూడూరు): జూన్ 04 ( వార్త వేదిక సూర్య):** ముఖ్యమంత్రి సహాయనిది ( సీఎంఆర్ఎఫ్) ద్వారా పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ఎంతో దోహదపడుతుందని డిసిసి ఉపాధ్యక్షులు నిమ్మన గోటి జ్యోజి అన్నారు. గురువారం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కప్పల ప్రవీణ్ కు ఇటీవల అనారోగ్యానికి గురిగాగా పేద కుటుంబానికి చెందిన ప్రవీణ్ ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నవీన్ కు మంజూరైన 60 వేల రూపాయల చెక్కును గురువారం ఆయనకు జోజి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కొత్తపెల్లి క్రిష్టయ్య, ఖమ్మంపాటి మధు, ఈదునూరి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**- బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్లెం కృష్ణ**



**యాదగిరిగుట్ట జూన్ 4 (వార్త వేదిక సూర్య) :** విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని యాదగిరిగుట్ట తాహాసిల్దార్ గారికి బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్లెం కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని కళాశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వలన అనేక కాలేజీలు ఇప్పటికే మూతపడ్డాయి, మరికొన్ని మూతపడే ప్రమాదంలో ఉన్నాయి. ఫీజు రియంబర్స్మెంట్ నిధులు రాకపోవడం వలన విద్యార్థులకు ఇచ్చే మెమోలు, టీసీలు ఇవ్వకుండా యజమాన్యాలు ఇబ్బందులపాలు చేస్తున్నాయని, ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలకు కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేస్తున్నది కానీ బావి భారత పౌరులైన పేద విద్యార్థుల కు ఎందుకు నిధులు విడుదల చేయడం లేదో అర్థం కావడంలేదని, ఇప్పటికే అనేక దఫాలుగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి గారు కాలేజీల యజమానులతో చర్చలు జరిపి అనేక హామీలు ఇచ్చినప్పటికీ అవి అమలు జరగడం లేదు, అందువల్ల తక్షణమే నిధులు విడుదల చేయాలని పేద మధ్యతరగతి వర్గాల విద్యార్థిని విద్యార్థులకు చదువు దూరమయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని తక్షణమే ఈ నెల 12వ తేదీ వరకు విద్యార్థులకు సంబంధించిన అన్ని ఫీజు బకాయిలు చెల్లించా లని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, గీతా పనివరాల సంఘం జిల్లా సభ్యులు బబ్బూరి శ్రీధర్, బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షులు పాకాల పాటి రాజు, కార్యదర్శి పబ్బాల స్వామి, గీతా పనివారల సంఘం మండల అధ్యక్షులు గుండు వెంకటేష్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు కంసాని రాము, నాయకులు ఆనంతుల నరసింహ, కంబాల జాంగిర్, బొమ్మిడి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరి నారసింహుని హుండీ ఆదాయం రూ.3.18 కోట్లు





**యాదగిరిగుట్ట జూన్ 4 (వార్త వేదిక సూర్య) :** శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీలను గురువారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఎస్పీఎఫ్ హోంగార్డుల భద్రత నడుమ స్వామి వారి హుండీలను కొండకింద సత్యనారాయణ స్వామి మండపంలోకి తరలించి ఈవో భవాని శంకర్ పర్యవేక్షణలో కౌంటింగ్ చేపట్టారు. భక్తుల చేత 30 రోజుల హుండీ ఆదాయం రూ.3,18,37,261, రూపాయలు వచ్చాయి. స్వామివారికి మిశ్రమ బంగారం 179 గ్రాములు, మిశ్రమ వెండి 3 కిలోలు, విదేశీ కరెన్సీ అమెరికా502 డాలర్లు, ఆస్ట్రేలియా 75 డాలర్లు, ఇంగ్లాండ్ 5 పౌండ్స్, యూఏఈ 95 దిరమ్స్, నేపాల్ 100 రుపీస్, కెనడా 130 డాలర్స్, సౌదీ అరేబియన్ 5, యూరప్ 10 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.




Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**